
సాక్షి
పల్నాడు

సోమవారం । 5 । మే । 2025



బల్లలు బహూకరణ

పెదకాకాని: పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి తక్కెళ్లపాడుకు చెందిన కోటేశ్వరరావు, అరుణకుమారి దంపతులు స్టీల్ బల్లలు బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఇది 138.3868 టీఎంసీలకు సమానం.



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాట్య గురువులను సత్కరించారు.

న్యూస్‌రీల్

భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, స్వామి, అమ్మవార్లకు పంచామృత స్నపన జరిపారు. స్వామివారు పెండ్లికుమారుని అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం నాదస్వర కచేరీ, వేద పఠనం, అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, రుత్విగ్వరణం, అంకురారోపణం, హోమం, బలిహరణం, ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

భగీరథ మహర్షికి ఘననివాళి



గుంటూరు వెస్ట్: భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని భగీరథ మహర్షి కీర్తిని వివరించారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, బీసీ సంక్షేమ శాఖాధికారి కె.మయూరి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌లో ముఖేష్‌కు రెండు స్వర్ణాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన షూటర్ ముఖేష్ నేలవల్లి రెండు బంగారు పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న 23వ కుమార్ సరేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం జరిగిన పోటీలో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ సీనియర్, జూనియర్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఇదే పోటీల్లో గత శుక్రవారం కూడా 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ లోనూ ముఖేష్ బంగారు పతకం సాధించాడు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆది దంపతులైన దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల తాకిడితో అంతరాలయ దర్శనం నిలిపివేసిన ఆలయ అధికారులు, భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. రూ.300, రూ.100 టికెట్లతో పాటు సర్వ దర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 6 గంటల నుంచే భక్తులతో క్యూలైన్లు నిండిపోగా, మహా మండపం వైపు నుంచి వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే లిఫ్టులో అనుమతించారు. అక్కడి నుంచి మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తడిసి ముద్దయ్యారు..

ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు వర్షంతో తడిసి ముద్దయ్యారు.

ఘాట్‌రోడ్డు మూసివేత..

ఆదివారం ఉదయం 8 గంటలకు భారీ వర్షం కురవడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును ఆలయ అధికారులు మూసివేశారు. సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో కొండ రాళ్లు విరిగిపడే ప్రమాదం ఉందని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు భావించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు.

తలోదారి.. అభివృద్ధి గోదారి

నరసరావుపేటలో కూటమి తీరు

- నియోజకవర్గ టీడీపీలో మూడు ముక్కలాట
- ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ, కోడెల శివరాం వర్గాలుగా విడిపోయిన టీడీపీ క్యాడర్
- స్తబ్దుగా కడియాల, నల్లపాటి వర్గీయులు
- ఎంపీ వెంట నడుస్తున్న జనసేన నేత జిలాని
- జిలానీకి వ్యతిరేకంగా ఓ సామాజిక వర్గ నేతలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ
- కూటమి నేతల తీరుతో జిల్లా కేంద్రంలో కుంటుపడిన అభివృద్ధి
- ఏడాది కావొస్తున్నా చెప్పుకోదగ్గ ఒక్క పనీ చేయని వైనం
- చిత్రాలయ ఆర్‌యూబీ, మల్లమ్మ సెంటర్ ఫ్లై ఓవర్ ఊసే శూన్యం

సాక్షి, నరసరావుపేట: రెండు దశాబ్దాల తరువాత పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చదలవాడ అరవింద్‌బాబు గెలుపు వెనుక టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ కార్యకర్తల సమష్టి కృషి ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన్న నడిపిస్తామని హామీలిచ్చారు. ఏయే ప్రాజెక్టులు చేపట్టబోయేది ఇంటింటికి తిరిగి చెప్పారు. పేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ప్రకటించారు. తీరా ఎన్నికల్లో గెలిచి ఏడాదవుతున్నా నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పని ఒక్కటంటే ఒక్కటి చేయకపోగా గత వైఎస్సార్ సీపీలో పట్టాలెక్కిన పనులను సైతం నిలిపివేశారు. మరి గెలిచిన కూటమి పార్టీల నాయకులు ఏం చేస్తున్నారన్న నరసరావుపేటలో ఎవర్ని అడిగినా కుమ్ములాటల్లో బిజీగా ఉన్నారని ఠక్కున చెబుతారు.

మూడు ముక్కలాట...

తెలుగుదేశం పార్టీలో సాధారణ ఎన్నికలకు ముందే గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే టికెట్ కోసం గ్రూపుల వారిగా ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేసుకున్నారు. ఎన్నికలు పూర్తయినా పేట టీడీపీలో మూడు ముక్కలాట నడుస్తోంది. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కోడెల శివరాం వర్గాలు విడిపోయాయి. అరవిందబాబుకు ఎమ్మెల్యే టికెట్ దక్కకుండా ఎంపీ లావు చివరకు ప్రయత్నం చేశాడని, ఆయనతో కలసి పనిచేసేది లేదని అరవిందబాబు వర్గీయులు తెల్చిచెబుతున్నారు. మరోవైపు టీడీపీలో గట్టి పట్టున్న ఓ సామాజిక వర్గాన్ని అరవింద బాబు పట్టించుకోవడంలేదన్న ఆవేదనతో వారు ఎంపీ లావు వెంట నడుస్తున్నారు. చదలవాడను ఎమ్మెల్యేగా అంగీకరించడానికి సైతం వారిలో కొందరికి మనసొప్పడంలేదన్న వాదన వినిపిస్తోంది.



■ ఇది ఇలా ఉండగా నరసరావుపేట గడ్డ కోడెల అడ్డా అంటూ కోడెల శివరాం వర్గీయులు గత కొంత కాలంగా స్పీడ్ పెంచారు. కోడెల నియోజకవర్గానికి చేసిన మంచి పనులను సోషల్‌మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. నరసరావుపేట ఏరియా వైద్యశాలలో కోడెల విగ్రహాన్ని ప్రారంభించి పట్టునిలుపుకొనే ప్రయత్నం చేశారు. రానున్న ఎన్నికల్లో కోడెల శివరామ్ కే ఎమ్మెల్యే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కోడెల అనుచరుల హవా కొనసాగిస్తున్నారు. ప్రకాష్‌నగర్ అద్దెభవనంలో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అక్కడి నుంచి మార్చాలని కోడెల శివరాం పట్టుబడుతుండగా, ఎమ్మెల్యే అరవింద బాబు అడ్డుకుంటున్నాడు. ఈవ్యవహారంలో ఇద్దరి మధ్య అంతర్గతంగా పోరు నడుస్తోంది.

■ మరోవైపు ఎన్నికల ముందు టికెట్ ఆశించి భంగపడ్డ నల్లపాటి రాము, కడియాల వెంకటేశ్వరరావులు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. అధిష్టానం వారికి నామినేటెడ్ పదవులను కట్టబెట్టకపోవడం, అరవిందబాబు సరైన ప్రాముఖ్యత ఇవ్వలేదన్న కారణంతో వారు స్తబ్దుగా ఉన్నట్టు తెలుస్తోంది.

రెండుగా విడిపోయిన జనసేన క్యాడర్

నరసరావుపేట ఎమ్మెల్యే సీటు తమదేనని భావించిన జనసేన పార్టీ ఎన్నికల తరువాత రెండుగా చీలిపోయింది. ఒక వర్గానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వర్గంగా ముద్రపడి, ఆయన పాల్గొనే కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యే అరవిందబాబుతో అంటీముట్టనట్టు ఉంటున్నాడు. దీంతో జనసేనలో క్రియాశీలకంగా ఉండే ఓ సామాజిక వర్గాన్ని ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నాడన్న ప్రచారం నడుస్తోంది. ఇలా జనసేన నేతలు రెండుగా విడిపోయి ఒకరిమీద ఒకరు అధినేతకు వరుస ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు నామినేటెడ్ పదవీ ఒక్కటీ దక్కలేదన్న ఆవేదన సగటు జనసేన కార్యకర్తలలో ఉంది. మరోవైపు తాము ప్రభుత్వంలో భాగస్వామ్యులైనా తగిన ప్రాధాన్యత దక్కడంలేదన్న బాధ బీజేపీ నేతల్లో ఉంది.

కూటమి నేతల అంతర్గత విభేదాలు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పల్నాడుకే పెద్దాసుపత్రిగా పేరొందిన ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సరైన వైద్యం అందక రోగులు అవస్థలు పడుతున్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉం

అభివృద్ధిపై ప్రభావం

డటం లేదు. పట్టణ ప్రజలను వేదిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం మల్లమ్మ సెంటర్‌లో ఫ్లైఓవర్, చిత్రాలయ టాకీస్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జేఎన్‌టీయూ భవనాల పూర్తి, ఆటోనగర్ ఏర్పాటు, కోటప్పకొండ అభివృద్ధి వంటి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి.



మల్లమ్మ సెంటర్ (ఫైల్)

ప్రభుత్వం మారిన తరువాత వాటిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించలేదు. ప్రజాసమస్యలను పూర్తిగా గాలికొదిలేసి న కూటమి నేతలు ఆధిపత్య పోరు నడుపుతున్నా రు. ఇప్పటికైనా కూటమి నేతలు అంతర్గత విబేధాలు పక్కన పెట్టి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు హితవు పలుకుతున్నారు.

ఘనంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడులో శ్రీ నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం కనులపండువలా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా కుంకుమబండ్లు కట్టి గ్రామంలో ఊరేగించారు.

మాజీ ఎమ్మెల్యే కాసు ప్రత్యేక పూజలు..

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నీలంపాటి అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. కాసు వెంట జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, ఎంపీపీ కందుల జాను, సర్పంచ్ నెమలికొండ వెంకటచారి, ఎంపీటీసీ పొస వెంకటనాగయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణతో పాటుగా గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు వరసగా చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కారణంగా వేదికలో మార్పు జరిగిందన్నారు. ఐదో తేదీ సోమవారం మాత్రం యథావిధిగా కలెక్టరేట్ వేదికగా పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు.

నీట్‌గా పరీక్ష

- పల్నాడు జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు
- 764 మందికిగాను 745 మంది హాజరు
- జేఎన్‌టీయూ-ఎన్ కేంద్రంలో 600 మందికిగాను 591 మంది హాజరు
- కేంద్రీయ విద్యాలయం (ఇర్లపాడు) లో 164 మందికి గాను 154మంది హాజరు
- దాహార్తితో అల్లాడిన తల్లిదండ్రులు



జేఎన్‌టీయూ-ఎన్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో వైద్య విద్యా కోర్సులు, దంత వైద్య విద్యా కోర్సులు చదవాలనుకునే విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన నీట్-2025 ప్రవేశ పరీక్ష పల్నాడు జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. నరసరావుపే జేఎన్‌టీయూ-ఎన్ కళాశాల, నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామ పరిధిలోని కేంద్రియ విద్యాలయంలో నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాలలో నమోదైన 600 మంది విద్యార్థులకుగాను 591మంది హాజరుకాగా, కేంద్రియ విద్యాలయంలో 164 మందికి గాను 154 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించగా విద్యార్థులను ఆయా పరీక్ష కేంద్రాలలోకి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు అనుమతించారు. కేంద్రం వద్ద హాజరైన విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష హాలుకు అనుమతించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు, బూట్లు, ఫోన్లు అనుమతించలేదు. జేఎన్‌టీయూ-ఎన్ పరీక్ష కేంద్రం నరసరావుపేట-వినుకొండ ప్రధాన రహదారికి దాదాపు రెండు కిలోమీటర్లు దూరం ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. పరీక్ష కేంద్రంలోకి అనుమతించేందుకు ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం సైతం దూరంగా ఉండటంతో మండుటెండలో విద్యార్థులు విలవిలలాడారు. 600 మంది విద్యార్థులు హాజరవుతున్న కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చిన్న టెంట్ విమర్శలకు తావిచ్చింది. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాల బహిరంగ ప్రదేశంలో ఉండటంతో ఒకవైపు వేసవి ఎండ తీవ్రత, మరోవైపు వడగాలులతో ఇబ్బందులకు గురయ్యారు. కనీసం మంచినీటి వసతి కల్పించక పోవటం పట్ల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. నాలుగు మంచినీటి కుండలను ఏర్పాటుచేసి చేతులు దులుపుకోవటంతో తల్లిదండ్రులు దాహార్తితో ఇబ్బంది పడ్డారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యం మజ్జిగ పంపిణీ చేయటంతో కొంత వరకు సేదదీరారు. తాగునీటి కోసం కనీసం 5 కిలోమీటర్లు వెళ్లాల్సి రావటంతో ఇబ్బందులు పడ్డారు. నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగియటం పట్ల సిటీ కోఆర్డినేటర్ నీరజ్‌కుమార్ శ్రీవాత్సవ ఆనందం వ్యక్తం చేసారు. పరీక్ష నిర్వహణలో సహకరించిన రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ ఇతర శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ప్రతిష్టా మహోత్సవాలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కేఆర్ కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మంహం కాళీ అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణ నూతన రాజగోపుర శిఖర కలశ ప్రతిష్టా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం గం 5:30 నిమిషాలకు నిత్య పూజావిధులు, యంత్రపూజలు, పీఠన్యాస, గర్తన్యాస, రత్నవ్యాసాదులు, 7:49 నిమిషాలకు యంత్రబింబ, ధ్వజస్తంభ ప్రతిష్ట, తదితర కార్యక్రమాలు జరిగాయి. ప్రతిష్టానంతరం అన్నసంతర్పణ జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి నారా లోకేష్ పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు. ఆలయ పునర్నిర్మాణ ప్రధాన దాతలు దొంతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వాసంతి, శ్రీప్రద్ విశ్వత్ రెడ్డి, ముఖ మండపం, విమాన గోపురం, రాజ గోపురం, నూతన ధ్వజస్తంభం పరివాహక దేవతలను బహూకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ దేవభక్తుని రంగప్రసాద్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.4 కోట్లు అయ్యిందని, దానిలో ఎండోమెంట్ వారు రూ.కోటి, దాతలు రూ.3కోట్లు సహాయం చేశారని తెలిపారు. దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్ కుమార్ ఏర్పాట్లు పరిశీలించారు. తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, ఏపీఎం సురేష్ కుమార్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఐ వెంకట రవికుమార్, పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.



క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

వేకువజామున మృత్యుఘోష

వేకువజామున ఒంగోలులో నిమిషాల వ్యవధిలో జరిగిన మూడు ప్రమాదాలతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఈ దారుణ ఘటనల్లో ఐదుగురు విగతజీవులు కాగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలం చూపరులకు ఒళ్లు గగుర్పాటు కలిగించేలా ఉంది. చెల్లాచెదురైన లారీ, నుజ్జు నుజ్జయిన కారులో ఇరుక్కొని పోయిన మృతదేహాలతో భయకంపితంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డు మీద వందలాది వాహనాలు నిలిచిపోవడంతో గందరగోళం నెలకొంది. ఈ ప్రమాదంలో తల్లీకొడుకులు, బాబాయ్- అబ్బాయిలు విగతజీవులయ్యారు.

- జాతీయ రహదారిపై మూడు ప్రమాదాలు
- నిమిషాల వ్యవధిలో ఐదుగురు దుర్మరణం
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- మృతులు నెల్లూరు, గుంటూరు జిల్లావాసులు
- డ్రైవర్ నిద్రమత్తుకు బలైన బాబాయి- అబ్బాయి
- మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ తల్లీకొడుకుల మృతి
- సురక్షితంగా బయటపడిన రెండేళ్ల చిన్నారి



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదాలతో నగరం ఉలిక్కిపడింది. వెంట వెంటనే మూడు రోడ్డు ప్రమాదాలు సంభవించడం... ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోవడం నిముషాల వ్యవధిలోనే జరిగిపోయింది. నలుగురికి గాయాలు కాగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వారిలో ఒకరిని గుంటూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పోలు ఫ్లై ఓవర్ దాటిన తరువాత కొద్ది దూరంలో టైరు పంక్చర్ కావడంతో ఒక లారీ ఆగింది. సరిగ్గా అదే సమయంలో తెలంగాణ నుంచి నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామానికి కోడిగుడ్ల లోడుతో వెళుతున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో ప్రమాద స్థలానికి కొద్ది దూరంలో ఇటుక లోడుతో వస్తున్న ట్రాక్టర్, కారు, ఒక మినీ లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దానికి 500 మీటర్ల దూరంలో మరో ప్రమాదం జరిగింది. గుంటూరు నుంచి తిరుపతి వెళుతున్న కారును వెనక నుంచి వచ్చిన భారీ కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ...

పెదకాకానికి చెందిన కొప్పురావూరు గ్రామానికి తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు గుంటూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అమరావతి రోడ్డులో కుటుంబంతో ఉంటున్నారు. ఆయన తన సమీప బంధువైన బూచి వినయ్ కుటుంబంతో కలిసి మొక్కు తీర్చుకోవడానికి గుంటూరులో అర్ధరాత్రి రెండు గంటల తరువాత తిరుపతికి బయలుదేరారు. తెల్లవారుజామున 4.50 గంటలకు జాతీయ రహదారిపై ఒంగోలు చేరుకున్నారు. బైపాస్ నుంచి ఫ్లై ఓవర్ దిగిన తరువాత కొద్ది దూరంలో ఒక రోడ్డు ప్రమాదం జరిగి ఉండడంతో కారు ఆపారు. అంతలోనే వేగంగా వచ్చిన ఒక భారీ కంటైనర్ వారిని ఢీ కొట్టింది. ముందున్న లారీ, వెనక ఉన్న కంటైనర్ల మధ్య చిక్కుకున్న కారు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో తిరుమలశెట్టి పావని (35), ఆమె కుమారుడు చంద్ర కౌశిక్ (14) అక్కడికక్కడే మృతి చెందారు. పావని భర్త తిరుమలశెట్టి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ప్రస్తుతం షాక్‌లో ఉన్న ఆయనకు నగరంలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

భర్త ఒంగోలులో...భార్య గుంటూరులో..

ఈ ప్రమాదంలో బూచి వినయ్ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉంది. తలకు తీవ్రంగా గాయాలైన నవీన్ కోమాలోకి వెళ్లిపోయారు. ఒంగోలులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో అత్యవసరంగా ఆపరేషన్ చేశారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పావని, కుమారుడు చంద్రకౌశిక్ (ఫైల్)

ప్రమాదస్థలిని పరిశీలించిన ఎస్పీ

ప్రమాదాల సమాచారం అందుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భారీగా వాహనాలు నిలిచిపోయివడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అతివేగం, నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కంటైనర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మిగతా వాహనాల డ్రైవర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. వినయ్ భార్య బూచి లావణ్యకు వెన్నెముకకు గాయం కావడంతోపాటు కాలు విరిగింది. దీంతో ఆమెకు మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఈ దంపతుల రెండేళ్ల కుమారుడు లోక్ స్మిత్ సురక్షితంగా బయటపడ్డాడు. అమ్మానాన్నలు కనిపించకపోవడంతో ఆ చిన్నారి రోదిస్తుండడం స్థానికులను కలిచివేసింది.

గమ్యం చేరకుండానే..

నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామానికి చెందిన రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (20) వరసకు బాబాయ్, అబ్బాయ్ అవుతారు. కోడిగుడ్లు తీసుకొని తెలంగాణలోని భువనగిరి నుంచి శనివారం రాత్రి బయలుదేరారు. మరో రెండు గంటలు గడిస్తే గమ్యం చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలిగొంది. ఒంగోలు-నెల్లూరు జాతీయ రహదారి మీద కొప్పోలు ఫ్లై ఓవర్ దాటగానే కొద్ది దూరం ప్రయాణించారో లేదో ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. కళ్లు తెరచి చూసే లోపలే పెద్ద శబ్దం వచ్చింది. కోడిగుడ్లన్నీ ఎగిరి రోడ్డు మీద పడ్డాయి. లారీ ముందు భాగం మొత్తం తుక్కుతుక్కయిపోయింది. లారీ డ్రైవర్ రవణయ్య అలియాస్ షేక్ రహీం (60) సహా బాబాయ్, అబ్బాయ్ దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒకరి తల ఛిద్రమైంది.

నిద్రమత్తే ప్రాణాలు తీసిందా...?

రాత్రంతా ప్రయాణం చేయడంతో తెల్లవారుజామున నిద్ర ముంచుకొని రావడంతోనే కోడిగుడ్ల లోడు లారీ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారును ఢీ కొన్న భారీ కంటైనర్ పరిస్థితి కూడా ఇదే. నాగాలాండ్ నుంచి రోజుల తరబడి ప్రయాణం చేయడం వలన డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నట్లు తెలుస్తోంది. దాంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఆగి ఉన్నా వేగంగా దూసుకొచ్చి ఇద్దరి ప్రాణాలు పోవడానికి కారణమయ్యాడు.

క్లుప్తంగా

రేపు ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

డీఎస్‌ఓ నరసింహారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్టు పల్నాడు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ – 2025 ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 24వ తేది వరకు 1వ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌ను డయ్యూ, దాదర్ అండ్ నగర్ హవేలి, డామన్ అండ్ డయ్యూలో నిర్వహించేందుకు క్రీడల సాంకేతిక నిర్వహణ కమిటీ (జీటీసీసీ) నిర్ణయించిందన్నారు. ఎంపికైన క్రీడాకారులు యూత్ గేమ్స్–2025లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. ఈమేరకు రాష్ట్రస్థాయిలో ఓపెన్ కేటగిరీలో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఎంపిక పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బీచ్ కబడ్డీ (పురుషులు), బీచ్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ (మహిళలు), కర్నూలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తుంగభద్ర నది ఒడ్డున సెపక్ తక్రా (పురుషులు, మహిళలు) ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు గెజిటెడ్ అధికారి సంతకంతో జారీ చేసిన సర్టిఫికెట్, వయస్సు ధృవీకరణ పత్రం, స్కూల్ బోనఫైడ్, ఇతర క్రీడా సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి

30 గంటలు వైద్యశాలలో మృత్యువుతో పోరాటం

బల్లికురవ: పొలంలో కూలీ పనులు చేస్తుండగా పాము కాటు వేయటంతో 30 గంటల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం సాయంత్రం ఓ మహిళాకూలీ మృతి చెందింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన గార్లపాటి మల్లేశ్వరి (52) కూలీనాలీ పనులు చేస్తూ భర్త కోటేశ్వరరావుకు చేదోడుగా నిలుస్తోంది. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లగా పొలంలో పాము కాటు వేసింది. హుటాహుటిన తోటి కూలీలు వైద్యానికి చిలకలూరిపేటలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయింది. మృతురాలికి భర్త, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే మల్లేశ్వరి.. పాము కాటుకు బలి కావడంతో కుటుంబ సభ్యులు, తోటి కూలీల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆగని రేషన్ బియ్యం దందా

- బియ్యం తరలిస్తున్న లారీని అడ్డుకున్న గ్రామస్తులు
- యంత్రాంగం నిర్లక్ష్యంతో యథేచ్ఛగా అక్రమ రవాణా

రేషన్ బియ్యంతో ఉన్న లారీని గ్రామస్తులు పట్టుకున్నా అక్రమ రవాణా కట్టడి కాని ఉదంతమిది. మండలంలో పేటసన్నెగండ్ల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రేషన్ బియ్యం లారీని గ్రామ యువకులు ప్రాణాలకు తెగించి పట్టుకుని అధికారులకు సమాచారం అందించడానికి యత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. వాహనం సహా డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

కారెంపూడి: రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదు. అక్రమార్కులు యథేచ్ఛగా బియ్యం తరలిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పేటసన్నెగండ్ల గ్రామంలో చాలాసేపు లారీని అక్కడి నుంచి పోకుండా అడ్డుకున్నారు. డ్రైవర్ లారీని వారిపై నుంచి పోనిచ్చే యత్నం చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు లారీ అద్దాలు పగులగొట్టి రేషన్ బియ్యానికి నిప్పు పెట్టారు. రేషన్ బస్తాలు కింద పడేశారు. అయినా ఫలితం లేదు. కిందపడేసిన రేషన్ బియ్యాన్ని లారీలో వేసుకుని డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. గ్రామస్తులు ఎంత రిస్క్ తీసుకున్నా రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోలేని అచేతన స్థితిలో అంతా ఉండిపోయారు. ఆగని ఈ అక్రమం వ్యవస్థలు పతనం అవుతున్న తీరుకు అద్దం పడుతోంది.


గ్రామస్తులు పట్టుకున్న లారీ

నాయకుల అండతోనే...

ఈ బియ్యం మండలానికి చెందినవి కావని, ఎక్కడ నుంచి వచ్చాయనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని గ్రామాలవారీగా నాయకులు పంచుకున్నారనేది ఇక్కడ బహిరంగ రహస్యమే. గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని నిర్దేశించిన ప్రాంతాలకు తరలించి ప్రధాన వ్యాపారులు ఆ బియ్యాన్ని సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.


నిప్పు పెట్టడంతో కాలిపోతున్న రేషన్ బియ్యం

బియ్యం ఇవ్వకుండానే...

కార్డుదారులకు బియ్యానికి బదులు కిలోకు రూ.10 వంతున ఇచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారని తెలుస్తోంది. కార్డుదారులు బియ్యం కోసం ఎదురు చూస్తుంటే వారి ఇళ్లకు రేషన్ బండ్లు వెళ్లకపోవడంతో ఎటూ బియ్యం ఇవ్వరేమోననే భయంతో, రేషన్ తీసుకోకపోతే కార్డు రద్దు అవుతుందనే భయంతో డీలర్ల వద్దకు వెళ్లి వేలి ముద్ర వేసి వారిచ్చిన డబ్బు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే పేట సన్నెగండ్ల రేషన్ బియ్యం ఉదంతం వెలుగుచూసింది. బియ్యం పంపిణీ ప్రారంభమైన రెండో రోజే ఇలా లారీ బియ్యం తరలిపోతుండడం చూసి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదిక

ఈ ఘటనపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ కలెక్టర్‌కు నివేదించారు. పేటసన్నెగండ్ల గ్రామంలో గత శుక్రవారం రాత్రి ఏపీ39యూఎన్7527 నంబరు లారీలో రేషన్ బియ్యంతో గ్రామంలోకి వస్తుండగా కొంతమంది యువకులు అడ్డుకున్నారని తెలిపారు. లారీ డ్రైవర్ వాహనాన్ని వారి మీదుగా తీసుకెళ్లడానికి యత్నించగా గమనించిన గ్రామస్తులు లారీపై దాడి చేయగా లారీ అద్దాలు ధ్వంసం అయ్యాయని పేర్కొన్నారు. బియ్యానికి నిప్పు పెట్టి రెండు బస్తాలు కిందపడేయం జరిగిందని తెలిపారు. లారీ డ్రైవర్ ఆ బస్తాలను లారీలో వేసుకుని అక్కడి నుంచి లారీతో పరారయ్యాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వీఆర్వో ఫిర్యాదు చేశారని తెలిపారు.

పాత గురజాలమ్మ గుడిని పునరుద్ధరించాలి



గురజాల: పల్నాడు జిల్లా గురజాల పట్టణ శివారులో పులిపాడు వెళ్లే దారిలో గల వెయ్యేళ్ల నాటి శిథిల పాత గురజాలమ్మ గుడిని పునరుద్ధరించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానికులైన కందిమల్ల శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదివారం గురజాలమ్మ ఆలయ శిథిలాలను పరిశీలించారు. ఆలయం పునాది వరకు మాత్రమే మిగిలి ఉందని, మహా మండపం ముందు మెట్లకు అందమైన ఏనుగు శిల్పాలు, అర్ధమండపం ముందు ప్రాణాలర్పించుకుంటున్న పల్నాటి వీరుడు, గర్భాలయంలో ఆనవాళ్లు కోల్పోతున్న గురజాలమ్మ విగ్రహం ఆలయ చరిత్రకు అద్దం పడుతున్నాయని చెప్పారు. స్థానికులు శిథిలాలను పదిల పరిచి కాపాడుకోవాలని శివనాగిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కందిమల్ల శ్రీనివాసరావు, మద్దినేని వెంకటేశ్వర్లు, ఆత్మకూరి వెంకట పుల్లారావు, శిల్పి సురటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కంటైనర్ బీభత్సం


ఘటనలో దెబ్బతిన్న భారీ ఇనుప స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

- వాహనంతోపాటు సీసీ కెమెరాలు ధ్వంసం
- డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే దుర్ఘటన

యద్దనపూడి: మండలంలోని తిమ్మాపురం శివారులో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి గుంటూరు వైపు వేగంగా ప్రయాణిస్తున్న కంటైనర్ అదుపుతప్పి నేరుగా హైవే సెంట్రల్ డివైడర్‌పై ఎక్కింది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అక్కడ ఏర్పాటు చేసిన భారీ ఇనుప స్తంభాన్ని ఢీకొట్టడంతో వాహనం ముందు భాగంతోపాటు స్తంభానికి బిగించిన సీసీ కెమెరాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని భారీ క్రేన్లతో ఇనుప స్తంభాలను తొలగించారు. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న సమయం కావడం, వాహనాల రద్దీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి డ్రైవర్ అలసట, నిద్ర మత్తే ప్రధాన కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్లు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.


కంటైనర్‌ను పక్కకు తీయిస్తున్న పోలీసులు

విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం: బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు సరిగ్గా చదవలేకపోయానని మార్కులు తక్కువ వస్తాయనే మనస్తాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన ఆదివారం కుందుల రోడ్డులో చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణనగర్ వైట్ హౌస్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కల్లూరి హరనాథ్‌బాబు గుంటూరు హౌసింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాడు. ఆయనకు ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె ఇందు మేఘన (20) ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతోంది. వారం రోజులుగా పాస్‌పోర్ట్ పని మీద తిరుగుతూ సెకండ్ సెమిస్టర్‌కు పూర్తిగా సిద్ధం కాలేకపోయింది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్సై తరంగిణి ఘటనా ప్రదేశంలో ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు.

ప్రజల ఆస్తులకు రక్షణగా ఎల్‌హెచ్‌ఎంఎస్

- వరుస చోరీలపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం
- స్పందించిన పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- దొంగతనాల నివారణపై అధికారులకు ఆదేశాలు


ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్: ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) ఉపయోగపడుతుందని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. వరుస చోరీలపై 'తాళం పడిందా.. ఇల్లు గుల్ల' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎస్పీ.. జిల్లాలోని పోలీస్ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు ఇచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి సెలవుల్లో ఇతర ప్రదేశాలకు వెళ్లే వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దొంగతనాల నియంత్రణకు ఈ వ్యవస్థను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ సౌకర్యం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన ఎక్కువ దొంగతనాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలోని ప్రజలు ఇల్లు విడిచి బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందించాలన్నారు. వారి ఇళ్లకు పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు.

వినియోగించుకోండిలా..

అందరూ స్మార్ట్ ఫోనులో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఇంటి నుంచే తమ పేరు, ఫోను నంబరు, లొకేషన్ వంటి ఇతర వివరాలు పొందుపరిచి రిక్వెస్ట్ పంపాలన్నారు. మొబైల్ నంబరుకు ఒక రిజిస్ట్రేషను నంబరు వస్తుందన్నారు. ఈ నంబరునే యూజర్ ఐడీగా పొందవచ్చునని పేర్కొన్నారు. స్టేషన్ నుంచి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. సీసీ కెమెరాలతో ఈ యాప్ అనుసంధానం కావడం వలన దొంగతనాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేశించిన వెంటనే పోలీసు కంట్రోల్ రూముకు సమాచారం చేరవేస్తూ అలారం మోగుతుందని చెప్పారు. దొంగతనాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం

లక్ష్మీపురం: రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి జగన్నాథం అన్నారు. గుంటూరు కొత్తపేటలోని కౌలురైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందడంలేదని మండిపడ్డారు. గుర్తింపు కార్డులు, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 6వ తేదీన గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కౌలు రైతులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.వి.జగన్నాథం

రణక్షేత్రంలో వీరాచారుల సందడి


వీరాచార నిర్వహణలో వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఆదివారం వీరాచారులు సందడి చేశారు. వదిలి పెట్టిన వీరాచారాన్ని మళ్లీ పునఃప్రతిష్ఠ చేసుకునే క్రతువులు రణక్షేత్రంలో జరిగాయి. వీరాచారులతో పాటు వారి బంధువులు వందలాదిగా తరలివచ్చి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వీరుల గుడి నాగులేరు ఒడ్డున వీరుల ఆయుధాలకు పూజ కట్టుకుని అక్కడ నుంచి చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు భారీగా తరలిరావడంతో రణక్షేత్రంలో ఉత్సవ వాతావరణం నెలకొంది. వీరుల గుడి ఆవరణ భక్తులతో నిండిపోయింది. వీరాచారుల ఊరేగింపులో బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతం పాల్గొనడం విశేషం. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో వీరుల గుడి పూజారులు వివిధ రకాల క్రతువులు నిర్వహించారు. కారెంపూడికి చెందిన కిల్లా స్వాములు కుమారులు, మనువళ్లు వదలిపెట్టిన వీరాచారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీటీ యడ్ల రామకృష్ణారావు, చెన్నకేశవస్వామి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కిల్లా చినకోటేశ్వరరావు, కిల్లా వంశస్తులు పాల్గొన్నారు.


చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తుల సందడి

పల్టీ కొట్టిన టిప్పర్.. తప్పిన పెను ప్రమాదం

కారంచేడు: టిప్పర్ లారీ కొమ్మమూరు కాలువ అంచుకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పెను ప్రమాదం తప్పింది. వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారి 167/ఏ కి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ లారీ అదుపుతప్పి ఆదివారం బోల్తా కొట్టింది. కారంచేడు నుంచి కుంకలమర్రు వైపు వెళ్లే రహదారి కొమ్మమూరు కాలువ కట్టమీదగా ఉంటుంది. ఈ కట్టమీద ప్రయాణించే సమయంలో ఎదురుగా మరో వాహనం రావడంతో రోడ్డు మార్జిన్ దిగిన టిప్పర్ లారీ అప్పటికే వర్ష కురిసి ఉండటంతో మార్జిన్ నానిపోయి మెత్తగా తయారైంది. దీంతో టిప్పర్ లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన పొక్లెయిన్ ద్వారా వాహనాన్ని తీయించారు.


కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో ప్రమాదానికి గురయిన టిప్పర్

శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న మారణాయుధాలతో పోలీసులు


పోలీసులకు సూచనలిస్తున్న గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు

పలు మారణాయుధాలు స్వాధీనం

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామ ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలనీలో టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు చెందిన ఒకే సామాజిక వర్గం వారు రాళ్లు రువ్వుకున్న సంఘటన జరిగినట్లు గుర్తుచేశారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనటంతో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా గురజాల డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో ఉదయం 5గంటల నుంచే కాలనీలో ప్రతి ఇంటిని తనిఖీ చేశామన్నారు. ఇళ్లల్లోని మరణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గడ్డపారలు, గొడ్డళ్ళు, నీళ్లల్లో కారం కలిపి నింపిన బాటిళ్లు, గోతాల్లో నిల్వ ఉంచిన రాళ్లను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని కత్తులు, గొడ్డళ్లు, ఇనుపరాడ్లు, కర్రలు, బరిసెలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ప్రజలందరూ సహకరించాలన్నారు. చిన్న విషయాలకు కూడా ఘర్షణలకు దిగి కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేయకుండా పనులు చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఐదుగురు సీఐలు, 11 మంది ఎస్‌ఐలు, వంద మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.